ప్రభుత్వ పాఠశాలల్లో 'తపస్ సభ్యత్వం'


సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మేడ్చల్: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నాయకులు మంగళవారం పర్యటించి సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తపస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్ మాట్లాడుతూ... తపస్ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటంతో పాటు విద్యార్థుల సౌకర్యాల కల్పనకు పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జాతీయ భావాలు అలవాటు చేసేలా నిత్యం పని చేస్తుందని అన్నారు. సమాజం పట్ల బాధ్యతతో ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు అందిస్తున్నామని అన్నారు. ఉపాధ్యాయుల నుంచి సంఘ సభ్యత్వం పట్ల మంచి స్పందన లభిస్తుందని అన్నారు. జిల్లా తపస్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు


కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలో పనిచేసే శానిటేషన్ కార్మికుల కోసం మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కార్మికులు ప్రతి నెల బస్తీ దవాఖానాల్లో హెల్త్‌చెక్ తప్పకుండా చేసుకోవాలని అన్నారు. కార్మికుల ఆరోగ్యంపై మున్సిపల్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని అన్నారు. వాష్ ఇన్‌స్టిట్యూట్ వారి సౌజన్యంతో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, గణేష్, కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, మల్లేష్‌గౌడ్, సానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్, ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, వాష్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు మణిశంకర్, రామకృష్ణ యాదవ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్క్ ఫ్రం ఆఫీస్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలి

ఇన్ఫోసిస్ యాజమాన్యానికి హాస్టల్ నిర్వాహకుల వినతి



ర్యాలీ నిర్వహిస్తున్న హాస్టల్ నిర్వాహకులు

పోచారం: ఇన్ఫోసిస్ పోచారం క్యాంపస్‌లో వర్క్ ఫ్రం ఆఫీస్‌ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పోచారంలోని ఇన్ఫోసిస్ క్యాంపస్ సమీపంలో వర్క్ ఫ్రం ఆఫీస్‌ను పునరుద్ధరించాలంటూ ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ... పోచారంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సుమారు 450 ఎకరాల భూమిని ఇన్ఫోసిస్ కంపెనీకి ఇచ్చారన్నారు. కరోనా మొదలు ఇప్పటి వరకు ఇన్ఫోసిస్ వర్క్ ఫ్రం హోం అమలు చేస్తూ ఇతర రంగ కార్మికుల ఉపాధికి గండి కొట్టిందన్నారు. ప్రస్తుతం పది శాతం ఉద్యోగులే ఆఫీసుకు వచ్చి పనిచేస్తున్నారని, దీన్ని వంద శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు ఆఫీసుకు వచ్చి పని చేస్తే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సుమారు లక్ష మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. పోచారం అభివృద్ధికి దోహదపడేలా ఇన్ఫోసిస్ యాజమాన్యం తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని ఉద్యోగులను ఆఫీసుకు పిలిపించాలన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరుణాకర్ మాట్లాడుతూ... ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేయడం వల్ల భవన యజమానులకు హాస్టల్ నిర్వాహకులు అద్దె కూడా చెల్లించలేక పోతున్నారన్నారు. ఇకనైనా హాస్టల్ రంగంపై ఆధారపడిన వారితో పాటు ఇతర రంగాల వారికి మేలు జరగాలంటే ఉద్యోగులు ఆఫీస్ నుంచే పనిచేయాలన్నారు. స్టార్ గ్రూప్ ఆఫ్ హాస్టల్స్ యజమాని శ్రీనివాసరావు గొట్టిపాటి మాట్లాడుతూ.. ఉద్యోగావకాశాలను కల్పించడంలో ఇన్ఫోసిస్ విఫలమైతే నిరుపయోగంగా ఉన్న భూమిని ఇతర కంపెనీలకు కేటాయించి, పోచారం ప్రాంత అభివృద్ధికి బాటలు వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అసోసియేషన్ కోశాధికారి మహీధర్, హాస్టల్ భవన యజమానులు సుధీర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, అసోసియేషన్ సభ్యులు ఆర్.కె.వర్మ, వేణు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసిన ఉపాధ్యాయులకు గుర్తింపు


సభలో పాల్గొన్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తదితరులు

కీసర: అంకిత భావంతో పనిచేసిన ఉపాధ్యాయులకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని పీఆర్టీయూ టీఎస్ (నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత సాల్వేరు వెంకటేశం ఉద్యోగ విరమణ.. అభినందన సభ మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు అంకిత భావంతో కొన్నేళ్లుగా విద్యాబోధన చేసిన నాగారం ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం సేవలను కొనియాడారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. అనంతరం వెంకటేశం దంపతులను ఘనంగా సత్కరించారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రైమరీ పాఠశాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరెల్లి కమలాకర్‌రావు, మాజీ గుర్రం చెన్నకేశవరెడ్డి, కౌన్సిలర్ వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్, ఆనంద్‌రెడ్డి, కీసర మండల అధ్యక్షుడు చీరయాదగిరి, ఈగ శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు వెంకటేశ్వర్లు, జిల్లా బాధ్యులు వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మండల బాధ్యులు శ్రీనివాస్, సుధాకర్, వెంకటరమణ, జోత్స్న, రాంచంద్రయ్య, భిక్షపతి, శ్రీదేవి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్
- కలెక్టరేట్ వద్ద జిల్లా రైతు సంఘం నేతల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీని తక్షణమే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.బాలమల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ... ధరణిలో వాస్తవంగా వ్యవసాయం చేస్తున్న రైతులను నమోదు చేయకుండా మోసం చేస్తుందని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి డీజీ సాయిల్‌గౌడ్ మాట్లాడుతూ... శామీర్‌పేటలోని సర్వే నంబర్ 1266లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొన్ని ఏళ్లుగా పంట సాగు చేసుకుంటున్న రైతులకు పట్టా పాస్ పుస్తకాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొమ్మరాజుపేట సర్వే నంబర్ 322, కీసర మండలం చీర్యాలలోని సర్వే నంబర్లు 74, 152లో వాస్తవంగా సాగు చేసుకుంటున్న రైతులకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వకపోవటంతో రైతు భరోసా రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సత్వరమే వారికి పాసు పుస్తకాలు ఇవ్వాలన్నారు. శామీర్‌పేటలో సర్వేనంబర్ 207లో ఒక ఎకరం భూమి విరాసత్ చేయాలని కోరారు. శామీర్‌పేట మండలంలోని 102 ఎకరాల సీలింగ్ ల్యాండ్‌లో డిగ్రీ జూనియర్ కళాశాల ఏర్పాటుతోపాటు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన భూములను పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సి.హెచ్.దశరథ్, ప్రధాన కార్యదర్శి శ్యామల వెంకట్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, చంద్రయ్య, కనకయ్య, బాలయ్య, నరేందర్, ప్రసాద్, సహదేవ్, యాదయ్యగౌడ్, రాములుగౌడ్, యాదగిరి, కృష్ణ, రాజేశ్వరి, నరేంద్రచారి, బీర్ల సత్తయ్య, అంజనేయులు కమలమ్మ, కౌసల్య, వెంకటేష్ పాల్గొన్నారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓ హరిప్రియ వినతి పత్రం సమర్పించారు.

పుస్తక పఠనం..మెరుగైన ఫలితం!

- కరోనాలో ఆన్‌లైన్ తరగతులతో విద్యార్థుల్లో తగ్గిన పుస్తక పఠనం
- రెండేళ్లుగా ప్రభుత్వ బడుల్లో రీడింగ్ క్యాంపెయిన్‌తో మెరుగైన ఫలితం
- ఇళ్లలోనూ పుస్తక పఠనంపై విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ
- తల్లిదండ్రుల ప్రత్యేక శ్రద్ధతో ఇంటి వద్ద దృష్టి సారించేలా చర్యలు
- పాఠశాల నుంచి మానిటరింగ్‌కు ప్రత్యేక టీచర్‌ను నియమించేలా కసరత్తు


ప్రభుత్వ బడుల్లో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

సాక్షి, సిటీబ్యూరో: కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో నిర్వహించిన ఆన్‌లైన్ తరగతులతో విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గి సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల వీక్షణం పెరిగింది. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ రంగప్రవేశంతో విద్యార్థుల్లో పుస్తక పఠనాశక్తి పడిపోతోంది. అతి వినియోగంతో కంటి రుగ్మతలతో పాటు ఇతర సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. సెలవు రోజుల్లోనూ డిజిటల్ తెరలకే అతుక్కుపోతున్నారు. దీంతో వారి అభ్యాసన సామర్థ్యాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నుంచి పిల్లలను బయటకు తీసుకురావడానికి విద్యాశాఖ పాఠ్యపుస్తక పఠనం, రాయడంపై శ్రద్ధ చూపాలని భావిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 2,447 పాఠశాలలు ఉండగా, ఇందులో హైదరాబాద్ జిల్లాలో 631 పాఠశాలలు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 515 పాఠశాలలు, రంగారెడ్డి జిల్లాలో 1,301 పాఠశాలలు ఉన్నాయి. రెండేళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో పఠనా శక్తిని పెంచటంతోపాటు నైపుణ్యాన్ని పెంపొందించటానికి 'చదువు-ఆనందించు-అభివృద్ధి చెందు' అనే నినాదంతో రీడింగ్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని ప్రభుత్వ నిర్వహిస్తోంది.

- విద్యాశాఖ చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుండటంతో ఇక ఇళ్లల్లో కూడా విద్యార్థులకు పుస్తక పఠనానికి అనుకూల వాతావరణం కల్పించేలా తల్లిదండ్రులు వ్యవహరించాలని సమావేశాలు నిర్వహిస్తోంది.

తల్లిదండ్రులు ఇలా చేయాలి...

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు ఇది వరకే ప్రభుత్వ బడుల్లో 'రీడింగ్ క్యాంపెయిన్లు, కార్నర్స్' ఏర్పాటు చేశారు. ఇంట్లో కూడా దీన్ని ఏర్పాటు చేయాలని పీటీఎం సమావేశాల్లో వివరిస్తున్నామని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. తల్లిదండ్రులు పిల్లల్ని ఇంటి వద్ద రోజూ కొంత సమయం చదివిస్తే అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపడి మంచి ఫలితాలు సాధించే అవకాశాలు మెండుగా ఉంటాయని భావిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఇంటికి రాగానే తమ పిల్లల చదువుపై తల్లిదండ్రులు ఆరా తీయాలి. ఆ రోజు ఏం నేర్చుకున్నారు? హోంవర్క్ ఇచ్చారా? అని పరిశీలించాలి. అభ్యాసన తీరు గమనించాలి. పిల్లలు సౌకర్యవంతంగా చదువుకోవడానికి కుర్చీలు, బల్లలు వంటి సదుపాయాలు కల్పించాలి. రీడింగ్ కార్నర్ వద్ద సరైన గాలి, వెలుతురు ఉండేలా చూడాలి. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాల్ని కంఠస్థం చేసేలా రోజూ ప్రోత్సహించాలి. పిల్లలు పెద్దలను అనుకరిస్తారు. పెద్దలు నిత్యం టీవీ, సెల్‌ఫోన్లు వాడుతూ కనిపిస్తే పిల్లల ఏకాగ్రత దెబ్బతింటుందని గ్రహించాలి. వ్యక్తిత్వ వికాసం, బొమ్మల కథలు, పరిసరాల విజ్ఞానం, శాస్త్రసాంకేతిక రంగాలపై బాలలస్థాయి పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి.

– ఐ.విజయకుమారి, డీఈఓ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

- తొలి పీటీఎం (తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం)లో ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఇంటివద్ద పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 'రీడింగ్ కార్నర్లు' ఏర్పాటు చేయాలని పేర్కొంటోంది.

ప్రశాంత వాతావరణం...

ప్రైవేటు బడుల్లో చదివే పిల్లలకు వారి తల్లిదండ్రులు ఇంటి వద్ద హోంవర్క్ చేసుకునేలా అందుకు కావాల్సిన రీడింగ్ కార్నర్ వంటి అనుకూల వాతావరణం కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. దీన్ని మార్చేందుకు పిల్లలు ఇంటికి రాగానే వారిపై ప్రత్యేక దృష్టి సారించి చదివేందుకు ఇంట్లోనే ప్రత్యేక ప్రదేశాన్ని ఏర్పాటు చేయాలి. ఆ సమయంలో టీవీలు, రేడియో, సెల్‌ఫోన్లు వినియోగించవద్దని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా పట్టణంలోని పలు కాలనీల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. పట్టణంలోని వినాయక్‌నగర్, 1 , 2, హౌసింగ్ బోర్డు కాలనీ, అయ్యప్ప గుడి ప్రాంతం, మార్కెట్ ప్రాంతం, ఎల్లమ్మ గుడి ప్రాంతంలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వివరించారు.

క్రికెట్‌లో రాణిస్తున్న మేడ్చల్ విద్యార్థి


షేక్ తజదీర్

మేడ్చల్: రాష్ట్ర స్థాయిలో వివిధ లీగ్ పోటీల్లో మేడ్చల్‌కు చెందిన విద్యార్థి విశేషంగా రాణిస్తూ చక్కని ప్రతిభ కనబరుస్తున్నాడు. మేడ్చల్‌కు చెందిన షేక్ తజదర్ మంగళవారం ఘట్‌కేసర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఏ టు డివిజన్ పోటీల్లో 9 ఓవర్లు బౌలింగ్ చేసి 32 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. మేడ్చల్‌లోని క్రికెట్ అకాడమీలో మన్సూర్ కోచ్ వద్ద కోచింగ్ తీసుకుంటూ రాటుతేలుతున్నాడు.

నైపుణ్యాల వృద్ధితోనే లక్ష్యసాధన


ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌కు హాజరైన విద్యార్థులు, తల్లితండ్రులు

ఘట్‌కేసర్: కొర్రెముల్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ మోటివేషన్ స్పీకర్ సుధీర్ చంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గమ్యం లేనిదే విజయం సాధించలేరన్నారు. గమ్యాన్ని చేరుకోవాలంటే కృషి, పట్టుదల అవసరమన్నారు. వ్యక్తిగత నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. తల్లితండ్రులు, అధ్యాపకులు చూపిన మార్గంలో పయనించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి జ్యోతి, ప్రిన్సిపాల్ జనార్ధన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర వెంకటేష్, హెచ్‌ఓడీ ఉదయ్‌కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌కు చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిన ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే మల్లారెడ్డి మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కిష్టాపూర్ 4వ వార్డుకు చెందిన బి. సుగుణకు రూ. 45 వేలు వేలు, జి.సుగుణమ్మకు రూ. 21 వేలు మంజూరైంది. కౌన్సిలర్ తుడుం గణేష్, దయానంద్‌యాదవ్, భాస్కర్‌యాదవ్, కోఆప్షన్ సభ్యుడు మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

పేదలకు వరం...

కీసర: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులోని రవీంద్ర నగర్ కాలనీకిచెందిన చిన్నం యశోదకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ. 60 వేలకు సంబంధించిన చెక్కును ఆయన అందజేశారు.

చెరువుల్లో విద్యాసంస్థలు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను ఆక్రమించి విద్యాసంస్థల భవనాలు నిర్మించిన మల్లారెడ్డి, అనురాగ్ యూనివర్సిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వీటిపై హైడ్రా దృష్టి సారించాలని కోరారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో చెరువులు, కుంటలు కబ్జా చేసి నిబంధనలకు విరుద్ధంగా బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లో భవనాలు నిర్మించి, ప్రైవేట్ యూనివర్సిటీ నడుపుతూ లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న విద్యాసంస్థల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

డంపింగ్‌యార్డు వద్ద అక్రమ కట్టడాల కూల్చివేత

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని డంపింగ్ యార్డు రాంకీ యాజమాన్యం ప్రధాన రహదారిని ఆక్రమిస్తూ అక్రమ కట్టడాలు చేసిన విషయం తెలుసుకున్న కాప్రా తహసీల్దార్ సుచరిత రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో ఆయా అక్రమ కట్టడాలను కూలిచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా రాంకీ యాజమాన్యం అక్రమ కట్టడాలు చేయడం సహించేది లేదన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీవో స్రవంతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరేంద్రసాయి, సిబ్బంది పాండు, సాయి తదితరులు పాల్గొన్నారు.

అనురాగ్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్


ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్: చెరువులు, కుంటలు ఆక్రమించి బహుళ అంతస్తులు నిర్మించి విద్యార్థులు జీవితాలతో చెలగాటమాడుతున్న అనురాగ్ విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మించిన అనురాగ్ యూనివర్సిటీపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వెంకటాపూర్‌లోని ఆ యూనివర్సిటీ గేటు ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అనురాగ్ విద్యార్థులకు నష్టం వాటిల్లితే యూనివర్సిటీ యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. అనంతరం గేటు ఎదుట ధర్నా చేపట్టిన ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులను పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అన్వర్, రంగారెడ్డి కార్యదర్శి వంశీవర్ధన్‌రెడ్డి, నాయకులు హరీశ్, అరుణ్, మహేశ్, అరవింద్, వినయ్, శివ, కార్తీక్, తేజ పాల్గొన్నారు.

యువతకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

మేడ్చల్: మండలంలోని షెడ్యూల్డ్ కులాల యువతీ యువకులకు, ట్రాన్స్‌జెండర్లకు 38 రోజుల పాటు డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ వసంతలక్ష్మి తెలిపారు. హకీంపేట్‌లోని టీజీఎస్ ఆర్‌టీసీ స్టాఫ్ ట్రెనింగ్ కాలేజ్ నిపుణలతో శిక్షణ ఇస్తారన్నారు. 18-35 సంవత్సరాలలోపు ఉండి 8వ తరగతి ఉత్తీర్ణత చెందిన వారు శిక్షణకు అర్హులని వివరించారు. వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీడీఓ కోరారు.

రాజశేఖర్‌కు డాక్టరేట్


రాజశేఖర్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ నల్లా నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఫార్మసీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.రాజశేఖర్‌కు డాక్టరేట్ లభించింది. నారపల్లి ఫార్మసీ ప్రొఫెసర్ పి.విజయలక్ష్మీ పర్యవేక్షణలో 'ఫార్ములేషన్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ డ్రైడ్ నానోసస్పెన్షన్స్ ఆఫ్ ప్యూర్లీ వాటర్ సొల్యుబుల్ డ్రగ్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఆయనకు జేఎన్టీయూ డాక్టరేట్ బహూకరించింది. ఈ సందర్భంగా ఆ కళాశాల కార్యదర్శి సి.వి.కృష్ణారెడ్డితోపాటు ఫార్మసీ విభాగం అధిపతి ప్రొఫెసర్ కృష్ణమోహన్, అధ్యాపక బృందం డాక్టరేట్ గ్రహీతను అభినందించారు.

ప్రగతినగర్ సమస్యల పరిష్కారానికి చర్యలు


సమస్యలు తెలుసుకుంటున్న వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి

కీసర: ప్రగతినగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు దమ్మాయిగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని ప్రగతినగర్‌కాలనీలో వారు పర్యటించారు. కాలనీవాసులతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కు స్థలాన్ని పరిశీలించారు. పార్కును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్

ఘట్‌కేసర్: బంధువుల ఇంటికెళ్లి వచ్చేసరికి ఇంటిలో చోరీ చేసిన కేసులో నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు మేరకు... పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మహమ్మద్ అక్రమ్ (32) జులై 31న రాత్రి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికెళ్లాడు. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయంటూ పొరుగు వ్యక్తి సమాచారం మేరకు ఇంటికి వచ్చేసరికి డోర్ తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన రెండు వెండి జతల పట్ట గొలుసులు, ఒక జత వెండి కాళ్ల కడియాలు, కొంత నగదు ఎతుకెళ్లగా బాధితుడు పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. విశ్వసనీయ సమాచారంతో సోమవారం సాయంత్రం పరారీలో ఉన్న మంద జహంగీర్ (సోను)ను స్థానిక బస్ ప్రయాణ ప్రాంగణం వద్ద అదుపులోకి తీసుకొని అతడి నుంచి చోరీ సొత్తును రికవరీ చేశారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రాము యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టి, కోలాటం ఆడి ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో నర్సింగ్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్, మహేశ్, సురేశ్, జగదీష్, మురళి, మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

యూట్యూబర్‌పై దాడి: పీఎస్‌లో ఫిర్యాదు

పోచారం: ఓ యూట్యూబర్ వీడియోలు తీస్తుండగా దాడి చేసిన వ్యక్తులపై పోచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ రాజు సమాచారం మేరకు... యూట్యూబర్ సురేష్‌యాదవ్ మంగళవారం వెంకటాపూర్‌లోని నీలిమా మెడికల్ కళాశాల భవన నిర్మాణాల ఫొటోలు తీస్తుండగా అనురాగ్ విద్యా సంస్థల ప్రతినిధులు కరుణాకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి దాడిచేశారు. దీంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితులపై కేసు నమోదు చేశారు.
– అనురాగ్ యూనివర్సిటీలోని బాలికల హాస్టల్‌లోకి యూట్యూబర్ సురేష్‌యాదవ్ అక్రమంగా ప్రవేశించి వీడియోలు తీస్తున్నాడని యూనివర్సిటీ ప్రతినిధి కరుణాకర్‌రెడ్డి పోచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికల హాస్టల్‌లో వీడియోలు తీయకూడదని చెప్పినా వినిపించుకోలేదన్నారు. ఇష్టం వచ్చినట్లు వీడియోలు తీస్తా, మీరెవరు నన్ను అడ్డుకోవడానికి అంటూనే అసభ్య పదజాలంతో సురేష్‌యాదవ్ దూషించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.